


హెచ్‌సీయూ భూములను చదును చేయడాన్ని నిరసిస్తూ సోమవారం యూనివర్సిటీ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులను చెదరగొట్టడానికి భారీగా మోహరించిన పోలీసులు

### లోకం పోకడ




# కాంగ్రెస్ గ్రీన్ హంట్

మొదటిపేజీ తరువాయి...

బుల్డోజర్ల చదునుతో ఎడారిలా మారుతున్నది. ఆదివారం అర్ధరాత్రి నుంచి యూనివర్సిటీలోని పచ్చని చెట్లను బుల్డోజర్లు కూకటివేళ్లతో పెకిలించి వేస్తున్నాయి. విలువైన ఔషధ మొక్కలు ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి. అరుదైన పక్షులు, జంతువులు బిక్కుబిక్కుమంటూ పరుగులు పెడుతూ హాహాకారాలు చేస్తున్నాయి.

**ఒకవైపు చదును పనులు.. మరోవైపు నిరసనలు**

పోలీసుల భారీ బందోబస్తు నడుమ టీజీఐఐసీ ఆధ్వర్యంలో హెచ్‌సీయూ పరిధిలోని భూముల్లో సోమవారం జేసీబీలతో చదును పనులు చేపట్టారు. బారికేడ్లను ఏర్పాటుచేసి పోలీసులు పహారా కాశారు. ఈస్ట్ క్యాంపస్ వైపునకు విద్యార్థులను అనుమతించకుండా పనులు చేపట్టారు. సాయంత్రం వరకు 60-70 ఎకరాల భూమిని పూర్తిగా చదును చేశారు. అటువైపు వచ్చిన వారిని అరెస్టు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. పోలీసుల తీరుకు ఆగ్రహించిన విద్యార్థులు ఆందోళనకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేస్తూ మెయిన్ గేట్ ముందు నిరసనకు దిగారు. ప్రభుత్వం చదును పనులను నిలిపేసేవరకూ ఆందోళన విరమించబోమని భీష్మించుకు కూర్చున్నారు.



హెచ్‌సీయూ భూముల్లోకి దండులా దూసుకొచ్చి వృక్షాలను పెకిలించేస్తున్న జేసీబీలు. వృత్తాల్లో అడుగుకొకటి జేసీబీ

**కనుమరుగవుతున్న 'గ్రీన్ లంగ్స్ ఆఫ్ హైదరాబాద్'**

జేసీబీలతో చెట్లను నేలమట్టం చేస్తుండటంతో 'గ్రీన్ లంగ్స్ ఆఫ్ హైదరాబాద్'గా పిలిచే ప్రాంతం కనుమరుగవుతున్నది. సోమవారం నాటికి సుమారు సగం భూమిలో చెట్లను తొలగించి భూమిని చదును చేశారు. దీంతో ఏండ్ల తరబడిగా నెలకొన్న జీవవైవిధ్యం కనుమరుగవుతున్నది. గ్రీనరీ తొలగింపుతో పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లనున్నట్టు పర్యావరణ వేత్తలు, మేధావులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

**హెచ్‌సీయూ పరిరక్షణకు సోషల్ మీడియా యుద్ధం**

హెచ్‌సీయూ పరిరక్షణకు అంతా ఒక్కటిగా నడుం కట్టారు. సామాజిక మాధ్యమాల వేదికగా 'సేవ్ హెచ్‌సీయూ బయోడైవర్సిటీ' అంటూ నినదిస్తున్నారు. ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్ తదితర వేదికల్లో యూనివర్సిటీ భూములను కాపాడాలంటూ రేవంత్‌రెడ్డి సర్కారుపై మండిపడుతున్నారు. మరోవైపు ఆ పోస్టులను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ట్యాగ్ చేయడం గమనార్హం. 'వేల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన, రూ.లక్షల కోట్ల విలువైన 400 ఎకరాల ప్రభుత్వ భూమిని రేవంత్ సర్కార్ అమ్మకానికి పెట్టింది. భారత్ జోడో యాత్రలో యువతకు ఇచ్చిన హామీని మర్చిపోయారా రాహుల్‌గాంధీ? భూముల రక్షణ కోసం పోరాటం చేస్తున్న విద్యార్థులపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దారుణంగా లాఠీచార్జి చేసి అక్రమ అరెస్టులు చేసింది. తెలంగాణలో ఏం జరుగుతుందో తెలుసుకోండి రాహుల్‌గాంధీ' అంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఎక్స్‌లో వీడియో పోస్టు చేశారు. 'తెలంగాణ ప్రభుత్వం డజన్ల కొద్దీ బుల్డోజర్లతో హెచ్‌సీయూ భూముల్లో విధ్వంసం సృష్టిస్తున్నది. వెంటనే వాటిని ఆపాలి. ఈ పోరాటంలో తన మద్దతు హెచ్‌సీయూ విద్యార్థులకే' అని ప్రముఖ పర్యావరణ ఉద్యమకారిణి లిసిప్రియా కంగుజమ్ పోస్టు చేశారు. 'హెచ్‌సీయూ భూముల అమ్మకానికి వ్యతిరేకంగా విద్యార్థులు నిరసన తెలిపితే వాళ్లను అరెస్టుచేయడం ఘోరం' అని టాలీవుడ్ నటుడు ప్రియదర్శి ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఖండించారు. 'పారిశ్రామిక ప్రాజెక్ట్ కోసం జీవవైవిధ్యం గల భూమిని కాపాడాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరితే, కోర్టు విచారణ పూర్తికాకముందే జేసీబీలతో విధ్వంసం చేస్తున్నారు ఎందుకు?' అని ప్రముఖ పర్యావరణ పాత్రికేయురాలు బహర్‌దత్ పోస్టు చేశారు. 'హెచ్‌సీయూలో అభివృద్ధి చెందుతున్న వృక్ష, జంతుజాలాన్ని నాశనం చేస్తున్నారు. చూస్తేనే గుండె తరుక్కుపోతుంది. ఈ మట్టిలో 237 పక్షిజాతులు, మచ్చల జింకలు, పాములు ఉన్నాయి. ఇవన్నీ మన వారసత్వం, సంస్కృతికి చిహ్నాలు' అని గుంజన్ పోస్టు చేశారు. 'తెలంగాణ ప్రభుత్వం హెచ్‌సీయూలో చేస్తున్న జీవవైవిధ్య విధ్వంసంపై జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఎందుకు మౌనంగా ఉంది? సుమోటో కేసుతో చట్టపరమైన చర్యలు తీసుకోండి' అని బీఆర్‌ఎస్ నేత శుభప్రద్ పటేల్ పోస్టు చేశారు. హెచ్‌సీయూ భూముల్లో రేవంత్ సర్కారు విధ్వంసాన్ని విద్యార్థి, యువజన సంఘాల నేతలు ఖండించారు.




హెచ్‌సీయూ భూములను కాపాడుకోవడానికి ఉద్యమ కార్యాచరణను తోటి విద్యార్థులకు వివరిస్తున్న ఓ విద్యార్థిని



హెచ్‌సీయూ జీవ వైవిధ్యాన్ని వివరిస్తూ తెల్లటి కాగితంపై బొగ్గుతో రాస్తున్న ఓ విద్యార్థి

## తెలంగాణలో తీవ్రమైన తప్పేదో జరుగుతున్నది!

- ప్రముఖ పొలిటికల్ కార్టూనిస్ట్ సతీశ్ ఆచార్య అసంతృప్తి
- సతీశ్ ఆచార్య పోస్టుకు స్పందించిన కార్తి చిదంబరం
- ప్రభుత్వ యంత్రాంగాల వైఖరి దురదృష్టకరమని వ్యాఖ్య

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో తీవ్రమైన తప్పేదో జరుగుతున్నదని ప్రముఖ పొలిటికల్ కార్టూనిస్ట్ సతీశ్ ఆచార్య అభిప్రాయం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. ఈ పోస్ట్‌కు కేంద్రమాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్‌నేత చిదంబరం కుమారుడు కార్తి చిదంబరం స్పందించారు. 'రాజ్యం/ప్రభుత్వం/అధికార యంత్రాంగం ఎక్కడైనా ఇన్‌చార్జిగా ఎవరున్నారనే నిమిత్తం లేకుండా ఇలాగే వ్యవహరిస్తున్నాయి. ఇది దురదృష్టకరం' అని తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం హెచ్‌సీయూలో విద్యార్థుల ఆందోళనను కవరేజ్ చేయడానికి 'ది సౌత్‌ఫస్ట్'కు చెందిన జర్నలిస్ట్ సుమిత్‌ఝా వెళ్లారు. కానీ పోలీసులు అతడిని అరెస్ట్ చేసి, కొల్లూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయాన్ని 'ది సౌత్‌ఫస్ట్' ఎడిటర్ అనూష రవిసూద్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి విభాగం ఎన్‌ఎస్‌యూఐ రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది. ఇప్పుడు సొంతపార్టీ నుంచి కార్తి చిదంబరం కూడా తప్పుబట్టారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

## రేవంత్ సర్కారుపై ఆగ్రహజ్వాలలు

- హెచ్‌సీయూలో ఉద్రిక్త పరిస్థితులపై ప్రజాసంఘాల గరం

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ): హెచ్‌సీయూ భూములను వేలం వేయాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపై దేశవ్యాప్తంగా తీవ్రస్థాయిలో చర్చ జరుగుతున్నది. విద్యార్థులపై పోలీసులు వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో సోషల్‌మీడియా వేదికగా విద్యార్థి, ప్రజాసంఘాలు, వివిధ పార్టీల నేతలు, జర్నలిస్టులు, పౌరులు ఖండిస్తున్నారు. ఏడాదిగా తెలంగాణలో రేవంత్ అరాచకం నడుస్తున్నదని, కాంగ్రెస్ పెద్దలు ఏం చేస్తున్నారు? అని ప్రశ్నిస్తున్నారు.

**రాహుల్ జీ.. విధ్వంసాన్ని ఆపండి**

రోహిత్ వేముల విషయంలో ఢిల్లీ నుంచి వచ్చిన రాహుల్‌జీ.. హెచ్‌సీయూ భూముల కోసం రేవంత్‌రెడ్డి పర్యావరణాన్ని సర్వనాశనం చేస్తున్నారు. క్విడ్ ప్రోకో కమీషన్లకు బదులుగా టీజీఐఐసీ వేలం ద్వారా కార్పొరేట్ లాభం కోసం అడవిని నరికేస్తున్నారు. విద్యార్థులపై లాఠీ చార్జీలు జరుగుతున్నాయి. ఇలాంటి దుశ్చర్యలతో రేవంత్‌రెడ్డి.. ఇందిరాగాంధీని అపహాస్యం చేస్తున్నారు. క్రూరమైన విధ్వంసాన్ని ఆపండి. భూముల వేలాన్ని ఖండించండి. హెచ్‌సీయూ క్యాంపస్ నుంచి జేసీబీలు, పోలీసు శిబిరాలను తొలగించండి.

–దాసోజు శ్రవణ్‌కుమార్, ఎమ్మెల్సీ

**రేవంత్‌రెడ్డి.. మీ ఓటమి తప్పదు**

చరిత్రలో భూములను గుంజుకున్నోడు ఎవడూ గెలవలేదు. హైడ్రా, మూసి, లగచర్ల చేదు అనుభవాల తర్వాత మళ్లీ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను గుంజుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారంటే అసలు మీకు కొంచెం కూడా సిగ్గులేదు. రాసుకో రేవంత్‌రెడ్డి గారు! ఇందులో కూడా మీకు ఓటమి తప్పదు.

–రాకేశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు

**అంత తొందరేంటో!**

హెచ్‌సీయూ భూముల పరిరక్షణ కోసం విద్యార్థులు ఆందోళన బాట పట్టారు. మరోవైపు జీవవైవిధ్య సంపద కలిగిన 400 ఎకరాలను తెలంగాణ ప్రభుత్వం పారిశ్రామిక ప్రాజెక్టు కోసం చదును చేస్తున్నది. న్యాయస్థానం విచారణకు ముందే బుల్డోజర్లను ఎందుకు రంగంలోకి దింపినట్టు?

–బహర్‌దత్, పర్యావరణ జర్నలిస్ట్

**స్టూడెంట్ ఫైట్**

తెలంగాణలో ప్రస్తుతం క్రికెట్ విషయానికి వస్తే ఎస్‌ఆర్‌హెచ్ వర్సెస్ జగన్‌మోహన్ రావు మధ్య జరుగుతున్నది. మరోవైపు భూమి విషయంలో ప్రభుత్వం వర్సెస్ విద్యార్థులుగా నడుస్తున్నది.

– కొరీనా ఎనెత్, జర్నలిస్ట్

**తెలంగాణలో ఎమర్జెన్సీ**

రాహుల్‌గాంధీ ఎక్కడికి వెళ్లినా రాజ్యాంగాన్ని వెంటబెట్టుకుని వెళ్తారు. కానీ తెలంగాణలో తప్పు వ్యక్తిని ఎంపిక చేసుకుని ఎమర్జెన్సీ పరిస్థితి తీసుకొచ్చారు. –చార్వాక

# రాహుల్ ద్వంద్వ రాజకీయాలు

- ప్రాంతాన్ని బట్టి ఆయన వ్యవహారశైలి
- ప్రతిపక్షంలో ఉన్న కేరళ, గుజరాత్‌లో ఓ లెక్క.. తెలంగాణలో మరో లెక్క
- విపక్షంలో ఉంటే నిరసనలు, లేఖలు.. అధికారంలో ఉంటే గప్‌చుప్
- ముంబై మెట్రో, ఛత్తీస్‌గఢ్ అటవీ విషయంలోనూ ఇదే తీరు
- రాహుల్‌గాంధీ వైఖరిని తూర్పారబడుతున్న మేధావులు, నిపుణులు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) పరిధిలోని 400 ఎకరాల భూముల్లో పర్యావరణ విధ్వంసానికి తెగబడుతున్న రేవంత్ ప్రభుత్వంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సమయంలో కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ ద్వంద్వ వైఖరిని కూడా పలువురు మేధావులు, పర్యావరణ నిపుణులు, విశ్లేషకులు తూర్పారబడుతున్నారు. ప్రాంతాలను బట్టి రాహుల్ 'పర్యావరణ' రాజకీయాలు చేస్తున్నారంటూ మండిపడుతున్నారు. కేరళ, గుజరాత్, అండమాన్ నికోబార్ దీవుల్లో ఆఫ్‌షోర్ మైనింగ్‌కు అనుమతిస్తే పర్యావరణ విధ్వంసం జరుగుతుందంటూ ప్రధాని మోదీకి లేఖ రాసిన రాహుల్‌కు.. తమ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణలోని హెచ్‌సీయూలో జరుగుతున్న పర్యావరణ విధ్వంసం కనిపించడం లేదా? అంటూ ప్రశ్నిస్తున్నారు. కేరళ, గుజరాత్‌లో కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నది కాబట్టే.. పర్యావరణం ముసుగులో రాహుల్ రాజకీయాలు చేస్తున్నారా? అంటూ నిలదీస్తున్నారు.

**అక్కడ వద్దంటూ లేఖ.. మరి ఇక్కడ?**

కేరళ, గుజరాత్, అండమాన్ నికోబార్ దీవుల్లో ఆఫ్‌షోర్ మైనింగ్ చేయడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇటీవల అనుమతులనిచ్చింది. ఈ మేరకు టెండర్లు పిలిచింది. అయితే, ఈ మైనింగ్ వల్ల పర్యావరణానికి ముప్పు పొంచి ఉన్నదంటూ ప్రధాని మోదీకి రాహుల్‌గాంధీ సోమవారం ఓ లేఖ రాశారు. ఆఫ్‌షోర్ మైనింగ్ కారణంగా సముద్ర జీవులు, కోరల్ రీఫ్స్, తీరాన్ని ఆనుకొని ఉన్న చెట్లకు తీరని నష్టం జరుగుతుందని, మత్స్య సంపద తగ్గి సముద్రాలపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నవారు రోడ్డున పడే ప్రమాదం ఉన్నదని ఆ లేఖలో పేర్కొన్నారు. ఆఫ్‌షోర్ మైనింగ్ వల్ల పర్యావరణ, సామాజిక-ఆర్థిక ప్రభావాన్ని అంచనా వేయడానికి కఠినమైన శాస్త్రీయ అధ్యయనాలు అవసరమని పేర్కొన్న రాహుల్.. పర్యావరణంపై ప్రభావాన్ని అంచనా వేయకుండా తీసుకొన్న ఈ నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని లేఖలో డిమాండ్ చేశారు. కాగా కేరళ, గుజరాత్ ఆఫ్‌షోర్ మైనింగ్‌పై ఇంతగా ఆందోళన చెందుతున్న రాహుల్.. హెచ్‌సీయూలో జరుగుతున్న పర్యావరణ విధ్వంసంపై నోరు మెదపరా? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. కేరళ, గుజరాత్‌లో కాంగ్రెస్ ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నదని, అందుకే పర్యావరణాన్ని రాజకీయాలకు వాడుకుంటున్నారా? అంటూ నిలదీస్తున్నారు. ఒకవేళ, రాహుల్‌కు పర్యావరణం మీద నిజంగా ప్రేమ ఉంటే.. హెచ్‌సీయూలో రేవంత్ సర్కారు కొనసాగిస్తున్న దమనకాండను అడ్డుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## గతంలోనూ ఇలాగే..

ఇప్పుడే కాదు.. గతంలోనూ రాహుల్ గాంధీ పర్యావరణ రాజకీయ ఆందోళనలకు పిలుపునిచ్చారు. ముంబై నగరానికి ఊపిరితిత్తులుగా పిలిచే (లంగ్స్ ఆఫ్ ముంబై) ఆరే ఫారెస్ట్ గుండా మెట్రో రైలు మార్గాన్ని నిర్మించాలని ముంబై మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఎంఆర్‌సీఎల్) నిర్ణయించింది. అయితే, ఈ మార్గంలో నిర్మాణాన్ని చేపడితే వేలాది చెట్లను తొలగించాల్సి ఉంటుంది. జీవవైవిధ్యం దెబ్బతినడంతో పాటు ఎన్నో వేల రకాల జీవజాతులు తమ ఆవాసాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. పర్యావరణం కూడా దెబ్బతింటుంది. దీంతో పర్యావరణ ప్రేమికులతో సహా రాహుల్ గాంధీ కూడా ఈ ప్రాజెక్టును వ్యతిరేకించారు. పర్యావరణాన్ని దెబ్బతీయొద్దంటూ ప్రసంగాలిచ్చారు. ఇక, ఛత్తీస్‌గఢ్‌లోని హస్‌దేవ్ అరండో అభయారణ్యంలో కేంద్రం అనుమతులివ్వడంతో అదానీ కంపెనీ బొగ్గు వెలికితీత పేరిట యథేచ్ఛగా మైనింగ్‌కు తెగబడింది. దీంతో పచ్చని చెట్లు సహా అక్కడి జీవజాలమంతా బుగ్గిగా మారుతున్నది. అదానీకి ఇచ్చిన కాంట్రాక్ట్‌ను రద్దు చేస్తూ పర్యావరణ విధ్వంసాన్ని అడ్డుకోవాలంటూ రాహుల్ నిరసనలు కూడా చేశారు. మిగతా ప్రాంతాల్లో ఇలా నిరసనలు చేసిన రాహుల్.. తమ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణలో పర్యావరణ విధ్వంసం జరుగుతుంటే నోరుమెదపకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## హెచ్‌సీయూ ఘటనలో పోలీసులదీ అదేతీరు

**ఆగ్రహం వ్యక్తంచేస్తున్న విద్యార్థులు**

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 31 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఘటనలో గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేసిన ఇద్దరు విద్యార్థుల విషయంలో పోలీసులు అవలంబిస్తున్న ద్వంద్వ వైఖరిపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. యూనివర్సిటీ విద్యార్థులను అకారణంగా అరెస్టు చేయడమే కాకుండా, వారు విద్యార్థులు కాదంటూ అధికారిక ప్రకటన విడుదల చేయడమేంటి? అని మండిపడుతున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఘటనలో ఆదివారం 53 మంది విద్యార్థులను అరెస్టు చేసి అదేరోజు రాత్రి సొంతపూచీకత్తుపై 51 మందిని విడుదల చేశారు. మిగిలిన ఇద్దరిని పోలీసులు తమ అదుపులోనే పెట్టుకున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి హెచ్‌సీయూ పీడీఎఫ్ స్కాలర్ విద్యార్థి రోహిత్‌కుమార్, పీహెచ్‌డీ విద్యార్థి నవీన్‌కుమార్‌ను అరెస్టు చేసి కూకట్‌పల్లి 10 ఏఎంఎం కోర్టు ముందు హాజరుపరిచినట్టు యూనివర్సిటీ సెక్యూరిటీ సూపర్‌వైజర్ సురేందర్ కుమార్‌కు నోటీసులు జారీచేశారు. అయితే, సోమవారం సాయంత్రం విద్యార్థులను రిమాండ్‌కు తరలించిన తరువాత విడుదల చేసిన అధికారిక ప్రకటనలో మాత్రం అరెస్టయిన ఇద్దరు వ్యక్తులు ప్రస్తుతం హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం విద్యార్థులు కాదంటూ పేర్కొన్నారు. దీనిపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

## హెచ్‌సీయూ విద్యార్థులపై జీవిత ఖైదు సెక్షన్లు?

**టీజీఐఐసీ ఫిర్యాదు మేరకు చర్యలు**
**బీఎన్‌ఎస్ 329(3) 118(1), 132, 191 (3), 351(3) సెక్షన్లు**
**మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చిన పోలీసులు**



అరెస్టు అయిన విద్యార్థులు

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ): 'మా భూములు.. మాకేనని' అహోరాత్రులు కొట్లాడుతున్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై కేసులు పెట్టే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరించింది. టీజీఐఐసీ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసులు నమోదు చేశారు. విద్యార్థులు మూకుమ్మడిగా దాడి చేశారని, మాదాపూర్ ఏసీపీ శ్రీకాంత్‌రెడ్డి గాయపడ్డారంటూ ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఇదే అదునుగా భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్)లోని 118 (1) సెక్షన్లను ఉద్దేశపూర్వకంగా పెట్టినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. ఎఫ్ఐఆర్‌లో 118 సెక్షన్ పెట్టినా దీని ద్వారా సెక్షన్ 118 (2) వర్తిస్తే.. ఆ సబ్ సెక్షన్ (2) ప్రకారం జీవిత ఖైదు, పదేండ్ల వరకూ పొడిగించే జైలు శిక్ష, రూ.20వేల వరకు జరిమానా విధించేలా సర్కారు పెద్దలు కుట్ర పన్నారని విద్యార్థులు మండిపడుతున్నారు. సబ్‌సెక్షన్ 2 ప్రకారం "ఏదైనా పద్ధతిలో స్వచ్ఛందంగా తీవ్రమైన గాయాన్ని కలిగించే వ్యక్తికి జీవిత ఖైదు లేదా ఒక సంవత్సరం కంటే తక్కువ కాకుండా పదేండ్ల వరకు పొడిగించే జైలు శిక్ష, జరిమానా విధిస్తారు." అని బీఎన్‌ఎస్‌లో స్పష్టంగా ఉంది. కాగా ఈ దారుణ సెక్షన్లు పెట్టిన ఇద్దరు విద్యార్థులు రోహిత్‌కుమార్, ఎర్రం నవీన్‌కుమార్‌ను కూకట్‌పల్లిలో జడ్జిముందు ప్రవేశపెట్టారు. తమ వారికి బెయిల్ వచ్చేలా కృషి చేయాలని హెచ్‌సీయూ విద్యార్థులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో పలు రాజకీయ పార్టీలను సంప్రదిస్తున్నారు. టీజీఐఐసీ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు తీసుకున్న పోలీసులు తాము ఇచ్చే ఫిర్యాదును తీసుకునేందుకు మాత్రం వెనుకాడారని, ప్రభుత్వ సెలవుల పేరు చెప్పి, ఫిర్యాదు తీసుకోవడంలేదని విద్యార్థులు వాపోతున్నారు. తమ విద్యార్థులపై జీవిత ఖైదు సెక్షన్లు వర్తించేలా దుర్మార్గంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయడమేంటని నిలదీస్తున్నారు. తాము ఏసీపీపై ఎలాంటి దాడి చేయలేదని చెప్తున్నారు.

**సెక్షన్ 329 (3) ఏం చెప్తుంది!**

ఈ 329 సెక్షన్ నేరపూరిత అతిక్రమణ గురించి చెప్తుంది. 329 (1)కింద కేసు బుక్ చేశారు. "నేరం చేయాలనే ఉద్దేశంతో లేదా ఆస్తిని కలిగి ఉన్న వ్యక్తిని బెదిరించడం, అవమానించడం లేదా బాధపెట్టడం లేదా చట్టబద్ధంగా అటువంటి ఆస్తిలోకి ప్రవేశించినా లేదా మరొకరి ఆధీనంలో ఉన్న ఆస్తిపైకి ప్రవేశించినా, ఆ వ్యక్తిని బెదిరించడం, అవమానించడం లేదా బాధపెట్టడం లేదా నేరం చేయాలనే ఉద్దేశంతో చట్టవిరుద్ధంగా అక్కడ ఉండిపోతే, నేరపూరిత అతిక్రమణగా పరిగణిస్తారు" అని ఈ సెక్షన్ చెప్తున్నది. దీని కింద మూడు నెలల వరకు జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తారు.


**సెక్షన్ 132, 191 గురించి**

బీఎన్‌ఎస్ సెక్షన్ 132 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగి విధిని నిర్వహణకు ఆటంకం కలిగించడం, డ్యూటీ చేయకుండా అడ్డుకునేందుకు దాడి చేయడం లేదా నేరపూరిత బలప్రయోగం కిందకు వస్తుంది. ఈ సెక్షన్ కింద రెండేండ్ల వరకు జైలు శిక్ష, జరిమానా, ఒక్కోసారి రెండూ ఉంటాయి. ఇక సెక్షన్ 191 అల్లర్లు గురించి చెప్తుంది. సెక్షన్ 191(1) ప్రకారం ఒక సమూహంలోని సభ్యులు అందరూ, లేదా కొందరు, బల ప్రయోగానికి దిగినట్టయితే దొమ్మీకి దిగినట్టుగా పరిగణిస్తారు. ఇందుకు రెండేండ్ల జైలు, జరిమానా.. ఒక్కోసారి రెండూ విధించే అవకాశముంది.

**సెక్షన్ 351(3), ఆర్/డబ్ల్యూ 3 (5) గురించి**

అల్లర్ల సందర్భంలో మరణం సంభవించేలా గాయరపర్చడం, తీవ్రమైన గాయాలు కలిగించేటట్టు చేయడం, ఆస్తిని తగలబెట్టటం, ధ్వంసం చేయడం, బెదిరించి భయోత్పాతం కలిగించడం వంటివి బీఎన్‌ఎస్‌లోని సెక్షన్ 351(3) పరిధిలోకి వస్తాయి. ఇలాంటి నేరాలకు మరణ శిక్ష, యావజ్జీవ కారాగారశిక్ష, లేక ఏడేండ్ల కన్నా ఎక్కువ శిక్ష విధిస్తారు. ఏడేండ్ల వరకు జైలుశిక్ష, జరిమాన, లేక రెండూ విధింపవచ్చు. ఇక సెక్షన్ 3 (5) ప్రకారం 'అనేక మంది కలిసి ఒకే లక్ష్యంతో ఒకే నేరపూరిత చర్యలో పాల్గొనడం. అటువంటి సందర్భంలో ఆ నేరమును ప్రతివ్యక్తి తనకు తానుగా చేసినట్టుగా పరిగణించి, ఆ నేరంలో పాల్గొన్నవారంతా శిక్షార్హులవుతారు' అని ఈ సెక్షన్లలో ఉంది. ఇలా విద్యార్థులపై కఠినమైన సెక్షన్లను ప్రయోగించారు.

- **హనుమకొండలో**



హెచ్‌సీయూ భూముల వేలం, లాఠీచార్జిని నిరసిస్తూ హనుమకొండ, భద్రాచలంలో విద్యార్థులు ఆందోళనకు దిగారు. దిష్టి బొమ్మలను దగ్ధం చేశారు.